క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సాయి హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని ఆనందపురం గ్రామంలో ఆదివారం వైభవంగా షిర్డీ సాయి హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 100 అడుగుల వెంకటి సాయి కోటి మహాస్థూపం వార్షికోత్సవం సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. పూజ్యగురువుల అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో ఈ కార్యక్రమాలను చేపట్టామని ఆలయ ధర్మకర్త మక్క వెంకటిసాయి తెలిపారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

ఎచ్చెర్ల క్యాంపస్: దోమాం గ్రామంలో శ్రీసత్య సాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 15 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని జిల్లా సత్యసాయి భజన మండలి అధ్యక్షుడు ఎన్ని లింగరాజు ప్రారంభించారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. సేవ ద్వారా సంతృప్తి లభిస్తుందన్నారు. సేవాదల్ కో ఆర్డినేటర్ రామచంద్రరావు పాల్గొన్నారు.

రెండు దశాబ్దాల తరువాత ఒకే వేదికపై..



ఒకేచోట కలుసుకున్న పూర్వవిద్యార్థులు

గార: అంపోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రెండు దశాబ్దాల తరువాత కలుసుకున్నారు. దీనికి చదువుకున్న పాఠశాలే వేదికైంది. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. గ్రూపు ఫొటోలు తీసుకొని మురిసిపోయారు. చదువు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషిచేద్దామని తీర్మానించారు.

సెబ్ సీఐగా బాధ్యతల స్వీకరణ



రణస్థలం: రణస్థలం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సీఐగా ఎం.విజయలక్ష్మి ఆదివారం విధుల్లో చేరారు. ఈమె విజయనగరం జిల్లా గజపతినగరం నుంచి రణస్థలం వచ్చారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన కిరణ్ మణీశ్వరి విశాఖపట్నం జిల్లాలోని చోడవరం బదిలీపై వెళ్లారు.

మార్మోగిన రామ నామం



రణస్థలం: కాషాయ జెండాలతో దన్నానపేట గ్రామస్తులు

రణస్థలం: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. రణస్థలం మండల కేంద్రంలోని రామతీర్థాల కూడలి వద్ద లక్ష దీపారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర సభ్యులు ఆదివారం తెలిపారు. దన్నానపేటలో గ్రామస్తుందరూ ఇంటిపై కాషాయ జెండాలు ఎగురవేసేందుకు సన్నద్ధం అవుతున్నారు.

ఘనంగా శోభాయాత్ర

ఎచ్చెర్ల: మండలంలోని మురపాక గ్రామంలో శ్రీరామ మందిరం పునఃప్రారంభం సందర్భంగా ఆదివారం శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి భక్తులకు ఆహ్వానం పలికారు. మండలంలోని మురపాక గ్రామం నుంచి అల్లినగరం వరకు ర్యాలీ నిర్వహించారు.

ఆరు ఒడిశా మద్యం సీసాల స్వాధీనం

- రెండు ద్విచక్ర వాహనాలు సీజ్
- నలుగురిపై కేసు నమోదు

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న సరిహద్దు చెక్కు పోస్ట్ వద్ద ఎస్ఐ మహమ్మద్ యాసిన్ ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన నలుగురు యువకులు పర్లాకిమిడి నుంచి నరసన్నపేట వైపు రెండు ద్విచక్ర వాహనాలపై ఆరు మద్యం బ్యాటిళ్లను తీసుకువస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.9,180 ఉంటుందన్నారు. రెండు ద్విచక్ర వాహనాలు సీజ్ చేశామన్నారు. నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరింది..



సొంతింటి కల నెరవేరుతుండడంతో అనేక కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో ఓ ఇంటివారిమి అయ్యామని కృతజ్ఞతను తెలియజేస్తున్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో జగనన్న గృహ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. పాత్రునివలస, రాగోలు, సింగుపురం ప్రాంతాల్లోని జగనన్న కాలనీల్లో వేలాది ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయి. చాలామంది గృహప్రవేశాలు పూర్తి చేసుకున్నారు.

–శ్రీకాకుళం రూరల్



రాగోలులోని జగనన్న అర్బన్ లేఅవుట్

కేటాయించిన ప్రాంతం	మంజూరైన ఇళ్లు	పూర్తయినవి
పాత్రునివలస	2,245	341
రాగోలు (అర్బన్)	1471	329
సింగుపురం	930	72
మొత్తం	2,176	1120



పూర్తయిన జగనన్న ఇళ్లు

ప్రభుత్వానికి రుణపడి ఉంటాను



ఎన్నో ప్రభుత్వాలను చూశాను. ఏ ప్రభుత్వం నుంచి సోలడు బియ్యం ఎరగను. అందరూ హామీలు ఇచ్చారే తప్పితే ఇల్లు, స్థలం మంజూరు చేయలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక నాకు రేషన్ కార్డు వచ్చింది. సొంత ఇంట్లో నివాసం దొరికింది. ఆరు నెలల క్రితం గృహ ప్రవేశం చేశాను. ప్రస్తుతం కుటుంబంతో కలిసి రాగోలులోని జగనన్న లేవుట్‌లోని ఇంట్లోనే నివాసం ఉంటున్నాను. ఇదివరకూ బాదుర్లపేటలో రూ. రెండు వేలు అద్దె చెల్లించి ఉండేవాడిని. అద్దె కట్టడానికి చెన్నై, రాయపురం ప్రాంతాలకు పనులు కోసం వలస వెళ్లేవాడిని. ఇప్పుడు సొంత ఇల్లు ఉండడంతో స్థానికంగానే పనులు చేసుకుంటూ సంతోషంగా ఉన్నాను. ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

– ఆర్.మోహన్‌రావు, రాగోలు

వేరివారి ఇంట్లో ఉండేవాళ్లం



మాది వాకలవలస స్వస్థలం. సొంత ఇల్లులేక నేను, నా భర్త వేరివారి ఇంట్లో పురిపాకలో ఉండేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చాక మాకు స్వంత ఇంట్లో నివాసం దొరికింది. ఇటీవల జగనన్న ఇచ్చిన లేఅవుట్‌లో గృహ ప్రవేశం చేశాం. ఈ ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటాం

– గురుగుబెల్లి లక్ష్మి, రాగోలు లేఅపుట్

అద్దె ఇంట్లో ఉండేవాళ్లం



మేము గడిచిన కొన్నేళ్లుగా అద్దె ఇంట్లో నివాసం ఉండేవాళ్లం. సొంత ఇల్లు లేక ఇబ్బందిపడేవాళ్లం. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగోలులో ఇంటి స్థలం మంజూరైంది. గతంలో అద్దె ఇంట్లో నెలకు రూ.3 వేలు వెచ్చించి ఉండేవాళ్లం. ఈ ప్రభుత్వం మాలాంటి పేదలకు ఎంతో ఊతం ఇచ్చింది. ప్రస్తుతం జగనన్న ఇంట్లోనే కుటుంబంతో కలిసి హాయిగా ఉంటున్నాం. ఇక్కడే చిన్న కిరణా వ్యాపారం చేసుకుంటున్నాం.

ఎ.నీలవేణి, రాగోలు

లెనిన్‌కు ఘనంగా నివాళి



లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజా పోరాటాలకు మార్క్సిజాన్ని అనువర్తింపజేసి, శ్రమజీవులందరినీ విప్లవ పథాన నడిపించిన ఘనత లెనిన్‌దని సీపీఐ సీనియర్ నాయకులు చాపర సుందర్‌లాల్ అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా సీపీఐ కార్యాలయం క్రాంతి భవన్‌లో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గ రహిత, దోపిడీ రహిత సమాజం కోసం లెనిన్ ఎనలేని సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డోల శంకరరావు, చిక్కాల గోవిందరావు, మొజ్జాడ యుగంధర్, పట్టణ సహాయ కార్యదర్శి కొమర భాస్కరరావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీరామ గానామృతం



శ్రీకాకుళం కల్చరల్: శ్రీరామ గానామృతం చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక పాండ్రింగి వీధిలోని రామమందిరంలో అయోధ్య బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని నాలుగు రోజులుగా శ్రీరామ గానామృత కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆదివారం భక్తులు శ్రీరామ జయరామ జయజయరామ జపం, అందాల రాముడు, శ్రీరామరామేతి రమేరామే మనోహరే సహస్రనామ తత్తుల్యం, మేఘశ్యామా రామాలాలి వంటి భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో మణికొండ కళ, శ్రీలక్ష్మి, జమున పాల్గొన్నారు.



గార: అక్షింతలను పంపిణీ చేస్తున్న దృశ్యం

అక్షింతలు పంపిణీ

గార: రామచంద్రాపురం పంచాయితీ జొన్నలపాడు గ్రామంలో ఆదివారం సాయంత్రం అయోధ్య రాములోరి అక్షింతలను పంపిణీ చేశారు. ముందుగా ఊరేగింపుగా అక్షింతలను రామమందిరం వద్ద తీసుకువచ్చారు. జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు రుప్ప శ్రీనివాసరావు, యువత, భక్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోటీలు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు బాల భారతంపై క్విజ్ పోటీలు జరిగాయి. 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి హితేష్‌కు, రెండవ బహుమతి ఎంఎస్‌కె రేవంత్‌కు సంస్థ వ్యవస్థాపకులు ఎల్.నందికేశ్వరరావు, నటుకుల మోహన్‌లు అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు బి.ఎం.ఎస్.పట్నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



పార్వతీపరమేశ్వరులను తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడుని మార్గశిర మాసం బహుళ ఏకాదశి సందర్భంగా ఆదివారం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. తిరువీధిలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణం



భగవద్గీత పారాయణం చేస్తున్న గీతా మండలి సభ్యులు

నరసన్నపేట: కొత్తపల్లిలోని రాధాకృష్ణ ఆలయంలో ఆదివారం భగవద్గీత పారాయణం చేశామని స్థానిక గీతా మందిరం నిర్వాహకులు సూరిబాబు తెలిపారు. అష్టాదశ క్షేత్ర పారాయణం సందర్భంగా పురాతన వేణుగోపాలస్వామి క్షేత్రాలకు వెళ్లి భగవద్గీతను పారాయణం చేస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని శ్రావణ మాసంలో ప్రారంభించినట్లు తెలిపారు. భగవద్గీతలోని 18 అధ్యాయాలను 18 శ్రీకృష్ణ క్షేత్రాల్లో పారాయణం చేసేందుకు సంకల్పించామన్నారు. ఇప్పటివరకు తొమ్మిది ఆలయాల్లో పూర్తిచేశామన్నారు. గీతా మండలి సభ్యులు 28 మంది పాల్గొన్నారు.

రంగస్థల నటుడికి నివాళులు



ఆదినారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రంగస్థల నటుడు, సీనియర్ సమాఖ్య సభ్యులు, శ్రీకాకుళం మండల వీధికి చెందిన గొండు ఆదినారాయణకు శనివారం ఆయన గృహం వద్ద రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగస్థలానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

నైరా విద్యార్థుల స్వచ్ఛభారత్



చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: పల్లివలస గ్రామంలో నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాస్ అధ్యక్షతన.. జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్‌ను చేపట్టారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త చెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చల్లారు.

రెడ్‌క్రాస్ పేట్రన్‌గా సూరిబాబు



సమోదు పత్రాన్ని అందుకుంటున్న సూరిబాబు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణానికి చెందిన సామాజిక, విద్యావేత్త అందవరపు సూరిబాబు తన 60వ జన్మదినం సందర్భంగా రెడ్‌క్రాస్ పేట్రన్‌గా సభ్యత్వం ఆదివారం పొందారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు విస్తృత పరచడానికి మంచి సహకారం దొరికిందన్నారు. ఈ సందర్భంగా సూరిబాబు రూ 25,100 అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, నిక్కు అప్పన్న, అందవరపు ప్రసాద్, రేఖ పాల్గొన్నారు.

ముక్కుపుడక బహూకరణ

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గ అమ్మవారికి పాతపట్నం యశోదనగర్‌కు చెందిన దినేష్ పాత్రో మూడు గ్రాముల బంగారం ముక్కుపుడకను ఆదివారం బహూకరించారు. ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావుకు ముక్కుపుడకను అందజేశారు. ఆలయ ధర్మకర్తలు కృష్ణారావు, నేతాజీ, ఉపాధ్యాయుడు మురళీమోహన్ పాత్రో, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భీమిలి సభను విజయవంతం చేయాలి



ఎచ్చెర్ల క్యాంపస్: మాట్లాడుతున్న ఎంపీపీ చిరంజీవి



జి.సిగడాం: పాలఖండ్యాంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 27న విశాఖపట్నం జిల్లా భీమిలిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమర శంఖారావం నిమిత్తం నిర్వహించనున్న జగనన్న సిద్ధం సభను విజయవంతం చేయాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి పిలుపునిచ్చారు. కుశాలపురం పంచాయతీ బైపాస్ కూడలి సమీపంలోని పార్టీ మండల కార్యాలయంలో ఆదివారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. మండలంలోని 28 గ్రామ సచివాలయాల నుంచి ప్రధాన నాయకులు హాజరుకావాలన్నారు. ఇంటింటికీ అందజేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రగతిని ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ముద్దాడ శంకర్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బొడ్డేపల్లి సుధాకర్‌రావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కేవీవీ సత్యనారాయణ, మండల పరిషత్ విప్ బగ్గు రాజారావు, యువజన విభాగం నాయకులు కొత్తకోట సూర్యారావు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు గుండ భాగ్యశ్రీ, సీనియర్ నాయకులు నేతింటి నీలం, సేవాదల్ అధ్యక్షుడు మొదలవలస కృష్ణారావు పాల్గొన్నారు.

జి.సిగడాం: రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేసేందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆనందపురం, సంతవురిటి, పాలఖండ్యాం, సీతంపేట, టి.డి.వలస తదితర గ్రామాల్లో పర్యటించారు. భీమిలిలో సీఎం జగన్ నిర్వహించనున్న సభకు తరలిరావాలని కోరారు. మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, పీఏసీఎస్ చైర్మన్ ఎర్నేన ప్రకాశరావు, నాయకులు టంకాల రామకృష్ణ, విక్రం కోటిబాబు, ఇజ్జి గోవిందరావు, రాయపురెడ్డి సూర్యనారాయణ, టంకాల సత్యనారాయణ, మానం సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన



ద్రావణాన్ని తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు

రణస్థలం: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో బొప్పాయి పంటకు సోకిన తెగుళ్లను నివారించవచ్చునని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ తెలిపారు. మండలంలోని బంటుపల్లి గ్రామంలో రైతు వెలిచేటి అరుణవాసరావుకు చెదిన ఎకరన్నర పొలంలో వేసిన బొప్పాయి పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేడ, ఆవు మూత్రం, ఇంగువ ద్రావణంతో తెగుళ్లను నివారించవచ్చునన్నారు. ఎకరాకు ఐదేసి లీటర్ల ఆవు మూత్రం, నీరు, పేడ తీసుకుని ఒక పాత్రలో వేసి నాలుగు రోజులు మురగపెట్టాలని సూచించారు. అనంతరం 100 గ్రాముల సున్నం, 150 గ్రాముల ఇంగువను వేడి నీటిలో కరగపెట్టి.. ఈ రెండింటిని కలిపి బొప్పాయి పంటపై పిచికారీ చేస్తే తెగుళ్లను సులవుగా నియంత్రించవచ్చునని వివరించారు. ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ పెద్దింటి రాజేశ్వరి, గ్రామ కార్యకర్త గిడిజాల సూర్యకాంతం, రైతులు పాల్గొన్నారు.

చురుగ్గా కుల గణన



ఎచ్చెర్ల: మురపాకలో కులగణన చేపడుతున్న సచివాలయ సిబ్బంది



జి.సిగడాం: ఆనందపురంలో కులగణన చేపడుతున్న దృశ్యం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని ఇంటింటా కులగణన సర్వేను వేగవంతం చేశారు. మురపాక, చిన్న మురపాక, బయ్యన్నపేట, కేశవరాయునిపాలెం తదితర గ్రామాల్లో సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు కలిసి కులగణన సర్వేను ఆదివారం చేపట్టారు.

ఆనందపురంలో..

జి.సిగడాం: మండలంలో అన్ని గ్రామ కులగణన సర్వే చేపడుతున్నారు. ఆనందపురం గ్రామంలో ఆదివారం నోడల్ అధికారి హేమంత్ కుమార్ సమక్షంలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. స్థానిక సర్పంచ్ చిత్తిరి మంజు, సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి

- అప్సా రాష్ట్ర నాయకులు మోహన్‌రావు



మాట్లాడుతున్న మోహన్‌రావు

నరసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోందని, పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తోందని, దీనిని స్ఫూర్తిగా తీసుకొని ప్రైవేట్ స్కూల్స్ అప్సా (డెమోక్రాటిక్) సంఘం తరపున తమవంతుగా ఏపీ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అప్సా సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపూడి మోహన్‌రావు అన్నారు. నరసన్నపేటలో ఆదివారం అప్సా జిల్లా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ ఆదేశాల మేరకు 25 శాతం ఫ్రీ సీట్లు పేద విద్యార్థులకు కల్పిస్తున్నామన్నారు. ఏపీ విద్యార్థులు దేశంలోనే మిన్నగా ఉండేందుకు వీలుగా తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రైవేట్ స్కూళ్లపై ఉదాసీనంగా ఉండాలని ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశానికి సంఘం ప్రతినిధులు ఆరంగి గోవిందరావు, కూన శ్రీకాంత్, మెట్ట వైకుంఠరావు, ప్రతాప్, జిల్లా నలుమూలల నుంచి పలు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

కారు బోల్తా – నలుగురికి తీవ్ర గాయాలు

కాశీబుగ్గ: పలాస మండలం కొబ్బరిఊరు జాతీయ రహదారి పక్కన ఆదివారం ఉదయం కారు బోల్తా పడింది. జాతీయ రహదారిపై ప్రయాణిస్తూ కొబ్బరిఊరు దగ్గరకు వచ్చే సరికి డ్రైవర్ నిద్ర మత్తులో జోగడంతో బండి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. దీంతో బండిలో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరు కోల్‌కతాకు చెందిన వారు. క్షతగాత్రులను పలాస సామాజిక ఆస్పత్రికి తరలించారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారని సమాచారం.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాతపట్నం: మండలంలోని రౌతులక్ష్మీపురం గ్రామానికి చెందిన పేద మహిళలకు అదే గ్రామానికి చెందిన పారశెల్లి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. శ్రీరాములు చిత్రపటానికి ట్రస్ట్ అధ్యక్షుడు రామరాజు నివాళులర్పించారు. సర్పంచ్ అంపోలు మధు, రెడ్డి వెంకటరావు, యారబాటి సన్యాసి, బి.బాలరాజు, కె.బాలయ్య, కె.కోటేశ్వరరావు, మన్మథరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విధుల్లోకి 86 మంది అంగన్‌వాడీ సిబ్బంది

కొత్తూరు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాల్లో ఉన్న 247 అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 419 మందికి అంగన్‌వాడీ సిబ్బందిలో 86 మంది విధుల్లో చేరినట్లు సీడీపీఓ విమలకుమారి ఆదివారం తెలిపారు. 172 మంది కార్యకర్తల్లో 39 మంది, 172 హెల్పర్లలో 39 మంది, 75 మినీఅంగన్‌వాడీ కార్యకర్తల్లో 8 మంది విధులో చేరారన్నారు.మిగిలిన సిబ్బంది విధుల్లో చేరాలని సీడీపీఓ కోరారు. విధుల్లో చేరని సిబ్బందిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.